
# మాతృమూర్తి

- యస్.యస్.వి.ఎ.కామేశ్వర కుమార్



"నిఖిల జగతి శిల్పికిదే నీరాజనం, నీ సకల కళా సృష్టి ఎంత శోభాయమానం" తిరుమల వీధులన్నీ ఇటువంటి మధుర సంకీర్తనలతో పవిత్రతను పెంచుతున్నాయి. సమయం రాత్రి 9.30 అవుతోంది. రకరకాల విద్యుద్దీపాలతో, కోటి వెలుగులు చిమ్ముతూ, బంగారు వన్నెలో మెరిసిపోతోంది శ్రీవారి గోపురం. అప్పుడే కోనేటి రాయుడి దర్శనం అయి బయటకు వచ్చి, గాలి గోపురం ఎదురుగా ఉన్న మెట్లపై కూర్చున్నాం.

"అప్పుడే మనం తిరుమల వచ్చి రెండు రోజులై, రెండు సార్లు దర్శనం అయిందంటే చాలా ఆశ్చర్యంగా వుంది. కాలం ఇలా వేగంగా నడవకుండా నిలిచిపోతే ఎంత బావుండును? జీవితాంతం ఇక్కడే ఉండిపోవాలని వుంది" ఆకాశాన్ని తాకుతున్నట్టున్న ఆలయ శిఖరం చూస్తూ తన్మయత్వంగా అన్నాను.

"రేపటి ప్రోగ్రాం ఏమిటి?" అడిగాడు చైతన్య, ప్రసాదం తింటూ.

"వీలైతే మరోసారి దర్శనం చేసుకుని, తరువాత గోవింద రాజస్వామి గుడి, అలివేలు మంగాపురం మొదలైనవి చూసి మరునాడు కాళహస్తి ప్రయాణం" అన్నాడు పవన్.

"తరువాత?"

"తరువాతేముంది? ఇంటికి ప్రయాణం!"

"కాళహస్తి నుంచి గొలగమూడి వెళదాం" అన్నాడు శ్రీను.

"గొలగమూడా?" ఎప్పుడూ ఆ పేరు వినకపోవడంతో ఆశ్చర్యంగా అడిగాం.

"కాళహస్తి నుంచి నెల్లూరు వెళ్లే దారిలో వుంది. నెల్లూరుకు కొంచెం ముందు దిగి లోపలికి వెళ్లాలి. అక్కడ వెంకయ్య స్వామి అని ఒక సాధువు సమాధి వుంది. నిరుడు ఇలాగే తిరుపతి వచ్చినప్పుడు ఒక స్నేహితునితో నేను వెళ్లాను. ఆయన గుడి ముందర ఒక రోజు నిద్ర చేస్తే కోరిన కోరికలు ఫలిస్తాయట. అనేక మంది ఇలాగే నిద్ర చేస్తారు. గుడి ముందర పందిరి వేసి ఉంటుంది. చాపలు కూడా అద్దెకి ఇస్తారు. వీలైతే మనందరం అక్కడికి వెళదాం" క్లుప్తంగా ఆస్థాన మహిమను వివరిస్తూ అన్నాడు శ్రీను.

అనుకున్న ప్రకారం కాళహస్తిలో అన్నీ చూసి సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో నెల్లూరుకు వెళ్లే బస్సెక్కాం. మాకు ఆ ప్రాంతం కొత్త కావటంతో గొలగమూడికి దిగే స్టాపులో ఆపమని కండక్టరుకి రెండు, మూడుసార్లు చెప్పి సీట్లలో కూర్చున్నాం. మూడు రోజుల నుంచి ఒకటే నడకేమో చల్లగా వీస్తున్న చల్లగాలికి తెలీకుండానే నిద్ర ఆవహిస్తోంది. రోడ్డు కూడా అంత రద్దీగా లేకపోవడంతో బస్సు వేగంగానే కదుల్తోంది. ఇంచు మించు బస్సులో అందరూ సుప్తావస్థలోనే వున్నారు. మధ్యలో పెద్దగా స్టాపులు కూడా లేవు. ఇంతలో నాకు ఇల్లు గుర్తుకు వచ్చింది. దాంతో నిద్ర ఎగిరిపోయి, బస్సు కన్నా వేగంగా ఆలోచనలు ముందుకు సాగి నా మనసు మా ఊరు చేరుకుంది. ఒంటరి తనం మనిషిని ఆలోచింపచేస్తుంది. ఒంటరిగా ప్రశాంతంగా ఆలోచించి, మనిషి సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతాడు. కనుక, నా దృష్టిలో, ఒంటరితనంలో మనిషికి మనసులోని ఆలోచనలే తోడు. అలాగే నాకూ, నా ఆలోచనలు తోడై ఇంటి దాకా చేరుకున్నాను.

* * *

చిరునవ్వులు చిందిస్తూ బోసి నవ్వుల రతనాలు కురిపిస్తూ అప్పుడప్పుడే తప్పటడుగులు వేసే మా అబ్బాయితో కాలం తెలియకుండా కరిగిపోతుండేది. అలా సరదాగా సాగుతున్న

సమయంలో ఓ రోజు ఉదయం నన్ను దుఃఖం నిద్ర లేపింది. హఠాత్తుగా మావాడికి డయేరియా అన్నారు. ఆసుపత్రిలోనే ఉంచారు. అలా 15 రోజులు ఆసుపత్రిలో ఉండి 12 సిలైన్లు ఎక్కించబడిన తరువాత వాడు నెమ్మదిగా కోలుకోవడం మొదలు పెట్టాడు. మొదటి రోజైతే వాడు కళ్లు తేలేసి బిగుసుకుపోయిన క్షణం ఈ లోకమంతా తల్లకిందులై, సృష్టంతా లయించిపోతే బాగుండుననిపించింది. అప్పుడప్పుడే నడక వస్తున్న వాడికి పాకడానికి కూడా ఓపిక లేనంత నీరసం.

విధి చాలా విచిత్రమైనది. ఎప్పుడు సుఖాల ఊయల ఊపుతుందో, ఎప్పుడు కష్టాల కన్ను తెరుస్తుందో, అంతా అనూహ్యం. అలాగే నా పై ఇప్పుడు విధి తన క్రూర పంజా విసిరిందనుకున్నాను. దేవుడు కష్టసమయాల్లో తప్పనిసరిగా గుర్తుకురావడం అనేది మానవుని సామాన్య మనస్తత్వం. మిగిలిన సమయంలో కంటే ఆపద సమయంలో అణువణువులో దేవుడు కనిపిస్తాడు. అనుక్షణం అతనే గుర్తుకు వస్తాడు.

నాది సగటు మానవుని మనస్తత్వానికి అతీతం కాదు, కనుకనే నాలుగు రోజుల నుంచి నా మనసులో ఇదే భావం. పెళ్ళి అయి 3 సంవత్సరాలు అయినా, పసుపు బట్టలతో శ్రీవారి దర్శనం చేసుకుందామన్న మొక్కు అలాగే మిగిలిపోయింది. ఒకసారి వెళ్ళివస్తే కొంత మానసిక ప్రశాంతత కలుగుతుందనే ఉద్దేశ్యం ఇంట్లో చెప్పాను.

"ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న వాడితో ప్రయాణాలు వద్దు" అన్నారు మా నాన్నగారు. దాంతో పోనీ ఒకసారి నేను వెళ్ళి వస్తానని చెప్పి మరో ముగ్గురు స్నేహితులతో ప్రయాణానికి సన్నాహాలు చేసుకున్నాను. ఏర్పాట్లయితే చేసుకున్నాను గానీ, నా చిన్నారిని వెడిచి వెళ్లాలంటే భయం. నన్ను ప్రేమగా నిమురుతూ, నాలో మానసిక బలాన్ని నింపి, నన్ను వెళ్ళి రమ్మని చెప్పిన నా తల్లి స్పర్శ నాలో కొంత భయాన్ని తగ్గించింది. అలా బయలుదేరిన నాకు, శ్రీనివాసుని దర్శనంతో కొంత మానసిక ప్రశాంతత కల్గింది. అలాగే శ్రీను, గొలగమూడి గురించి చెప్పేసరికి అక్కడికీ వెళ్లాలనిపించింది. గమ్యం చేరాలనే కోరిక కలవాడు ప్రతి అవకాశాన్నీ వినియోగించుకోవాలనుకుంటాడు.

* * *

బస్సు ఆగిన కుదుపుకి ఈ లోకంలోకి వచ్చాను. అప్పటికే మిగతా ముగ్గురు లేచి లగేజి సర్దుతున్నారు..సమయం రాత్రి 9.30 అవుతోంది. రోడ్డు ప్రక్కగా ఓ పాక తప్ప ఇంక అక్కడేమీ లేవు. మిణుకు మిణుకు మంటున్న చిన్న దీపం వెలుగులో కుక్కి మంచం మీద చుట్ట తాగుతున్న తాత కనిపించాడు.

"తాతా గొలగమూడికి ఎటెళ్లాలి?"

"అదే బాబూ! ఎదురుగా ఉన్న ఆ మట్టిరోడ్డు. ఇక్కడికి 6,7 కి.మీ పైనే వుంటుంది. ఇప్పుడే చివరి బస్సు కూడా వెళ్ళిపోయిందే..."తనదైన రాయలసీమ యాసలో చెప్పాడు.

ఆ మాట వినేసరికి ప్రాణం ఉసూరుమంది. చుట్టూ చిమ్మచీకటి. ఓ పక్క ఆకలి. ఇంకా పూర్తికాని ప్రయాణం. నీరసంగా ఆ మట్టి రోడ్డు వైపు వచ్చి అక్కడో రాయి మీద చతికిలబడ్డాం. ఆ దారిన పోయే లారీలు, బస్సులు ఏమైనా ఈ సందులోకి తిరుగుతాయేమోనని ఆశగా చూస్తున్నాము. కానీ అవి దూరంగా వెళ్లే కొద్దీ మళ్లీ చీకటే మాకు తోడవుతోంది తప్ప, దగ్గరయ్యే వెలుగు కనిపించట్లేదు.

చివరకు ఓ ఆటో మావైపు తిరగడంతో ఒక్క ఉదుటున లేచి నిలబడ్డాం. మా అదృష్టం పుచ్చి ఆటో ఖాళీగా ఉండటం, మేము గొలగమూడి చేరుకోవటమూ జరిగిపోయాయి. అక్కడ దిగగానే అది చాలా చిన్న పల్లెటూరని అనుకున్నాను. ఆ పక్కనే ఓ రూంలో లగేజీ పడేసి ఉదర పూజకేమైనా దొరుకుతుందేమోనని బయటపడ్డాం.

"ఇక్కడ ఈ సమయంలో ఇంకేమీ దొరకవు. ఈ పక్కనే భోజనం దొరుకుతుంది గానీ, ఈ టైంలో సాధారణంగా ఉండటం కష్టం. అక్కడ దొరికితే మీ అదృష్టం, లేదా ఈ రోజుకింతే.." చెప్పాడు కిళ్లీ కొట్టు అతను. అప్పటికి పదిన్నర దాటుతోంది. మా అదృష్టాన్ని పరీక్షించుకుంటూ, అతను చెప్పిన వైపుకు వెళ్లాం. అదో ఆశ్రమంలా వుంది. దానిలోకి అడుగు పెడుతూ, గుమ్మం దగ్గర కనిపించిన నాలుగు కుక్కలని చూసి ఆగిపోయాం.

"ఎవరూ?" అరవై యేళ్ళు పైనేఉంటాయి. ఓ అవ్వ బయటికి వచ్చింది.

"ఇక్కడ భోజనం దొరుకుతుందని వచ్చాం."

"రండయ్యా. లోనికి రండి. అవేం చెయ్యవు" అంటూ వాటిని పక్కకు తరిమింది. ఆ నాలుగు కాస్త దూరంగా వెళ్లి కూర్చుని మా వైపే


100% AYURVEDIC PRODUCT

గ్యాస్ట్రబుల్‌తో బాధపడుతున్నారా?
మలబద్ధకము తో
ఇబ్బంది పడుతున్నారా?
కడుపునొప్పి మొదలగు జీర్ణశక్తికి
సంబంధించిన వ్యాధులకు అనేక
సంవత్సరముల నుండి
ప్రయోగములు చేసి చంద్రికా వారిచే
తయారుచేయబడినటువంటి
అతి ఉత్తమమైన ఆయుర్వేద మందు

క్యాప్‌జైమ్
చూర్ణము




జీర, ఇంగువ, సైంధవలవణం, యవాక్షారము, ఇసబ్‌గోల్, మారీచము మొదలగు అనేక రకములైనటువంటి అతి ఉత్తమమైన ఆయుర్వేద మూలికలతో తయారు చేయబడినది.

ఈ క్యాప్‌జైమ్ చూర్ణమ్ తీసుకొనుట వలన ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్ రావు

మార్కెట్ చేయువారు
రామా మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ & కో.
పార్కురోడ్, విజయవాడ -1. ఫోన్: 2424133.

చూస్తున్నాయి. ఏ క్షణంలో మీద పడతాయోనని భయపడుతూ, కాళ్ళు చేతులు కడుక్కొని అవ్వ ఇచ్చిన చాప వేసుకుని కూర్చున్నాం. అదంతా మట్టి నేల అవడంతో ఇసక కాళ్లకు గుచ్చుకుంటోంది.

"కాళ్ళు చేతులు కడుక్కోండయ్యా" విస్తరాకులు తెచ్చి వేస్తూ అంది.

"అవన్నీ అయ్యాయి కానీ, తొందరగా పెట్టు" కొంచెం నిర్లక్ష్యంగానే అన్నాం. నెమ్మదిగా ఒక్కక్కటీ తెస్తూ వడ్డిస్తోంది. అన్నం మెత్తబడిపోయింది. కూర చాలా కారంగా ఉంది.

"ఇదేం హోటల్‌రా నాయనా? ఈ తిండేంటో, అసలే కడుపు కాలిపోతోంది" అనుకుంటూ అతి కష్టం మీద కొంచెం తిని ఇక తినలేక చెయ్యి కడిగేశాం.

"అయ్యో అదేంటి నాయనా, సొంతం తినలేదు. కొంచెం మజ్జిగతో తినండయ్యా తెల్లారేపాటికి ఆకలవుద్ది" చాలా ప్రేమగా అంది. నెమ్మదిగా నడుస్తోంది. కూర్చొని లేవడానికి చాలా ఇబ్బంది పడుతోంది.


"తిన్నది చాల్లే. కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి" అన్నాడు శ్రీను.

"బాగా పొద్దు పోయింది కదయ్యా! ఎప్పుడో వండిన వంట. మీరు మరికొంత ఆలస్యంగా వచ్చి ఉంటే ఇది కూడా ఉండేది కాదు. రోజా మిగిలినది ఈ కుక్కలకు వేసేస్తూ ఉంటాను."

మేము కాళ్ళూ చేతులు కడుక్కుంటున్నాము. తను ఆకులు తీస్తూ "ఎవరూ సరిగ్గా తినలేదు" అంటూ, అదే మాటను పదే పదే అనుకుంటోంది.

## పవన్ క్రేజ్

హీరో పవన్ కల్యాణ్ అంటే తెలుగులోనే కాదు తమిళంలోనూ క్రేజ్ అధికంగా ఉంది. ముఖ్యంగా తమిళ యువదర్శకులందరూ తెలుగులో సినిమాలు చేస్తే పవన్‌తోనే చెయ్యాలని అనుకుంటున్నారు. తెలుగులో పవన్ కల్యాణ్‌కు మించిన మాస్ హీరోలెవరూ లేరని తమిళ దర్శకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. విక్రమ్ నటించిన 'దిల్'తో సంచలనం సృష్టించిన దర్శకుడు ధరణి విక్రమ్‌తోనే 'ధూల్' అనే చిత్రాన్ని రూపొందించాడు. ఈ చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేసి, దానిలో చిరంజీవిని హీరోగా పెడదామనుకున్నారు. దర్శకుడు ధరణి మాత్రం తాను పవన్ కల్యాణ్ నటిస్తేనే దర్శకత్వం వహిస్తానని, లేదంటే సినిమా చెయ్యనని పట్టుబడుతున్నాడు. పవర్ స్టార్ పవన్ అంటే మజాకానా? ఎంతైనా అన్నను మించిన తమ్ముడు కదా!



"డబ్బులు ఎంతివ్వాలి?" పర్సు తీస్తూ అన్నాడు పవన్.

"బాబూ! ఇదంతా ఆ వెంకయ్య స్వామి ప్రసాదమే నాయనా. పొండి, శుభ్రంగా ఆ స్వామీ సమాధి ముందు పండుకోండి" అంటూ మావైపు ఆప్యాయతగా చూస్తోంది. ఆ కళ్ళల్లో కన్న తల్లి తన బిడ్డపై చూసే ప్రేమ. అంతవరకూ నిర్లక్ష్యంగా మాట్లాడిన మాకు నోట మాట రాలేదు. అంత పెద్ద వయసులో కొంచెం కూడా చిరాకు పడకుండా ఇంత రాత్రి పూట అన్నం పెట్టింది. అదీ నిజానికి ఆ మూగ జీవాల తిండి. పైగా మేము తినలేదని బాధపడిపోయింది.

ఎంత చదువుండి ఏం లాభం? త్రిమూర్తులకు ఆకలి తీర్చిన నాలుగు వేదాలూ, నాలుగు కుక్కలుగా వెంట తిరిగే దత్తాత్రేయుని తల్లి అయిన అనసూయని ఆ అవ్వలో చూడలేకపోయాము. అప్పటి వరకూ అది హోటల్ అనే అనుకున్నాం గానీ, అది ఆ స్వామి వారి ఉచిత భోజన శాల అనీ, ఆ అవ్వ అక్కడ ఉద్యోగి అనీ తెలియదు. ఎంత ఉద్యోగ ధర్మమయినా అవ్వ అన్నం పెట్టిన తీరు ప్రశంసనీయమనిపించింది.

నా తల్లి కరస్పర్శ నాలో మానసిక బలాన్ని నింపితే, ఈ తల్లి కంటిలోని కాంతితో నిండిన ప్రేమ స్పర్శ నాలో కొత్త మానవత్వాన్ని మేల్కొల్పింది. ఇప్పటికీ ఆ తల్లి కళ్ళల్లోని ప్రేమ కాంతి నాకు కనిపిస్తూనే వుంది. ఆకలి తీర్చడానికి కన్న తల్లే అవసరం లేదనీ, మనసున్న ఏ స్త్రీ మూర్తయినా చాలనీ, నిరూపించిన ఆ మాతృమూర్తి గుర్తుకు వచ్చినప్పుడల్లా ఇప్పటికీ నా హృదయం కృతజ్ఞతతో వినయంగా స్పందిస్తుంది.

❋

